# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ మాసపత్రిక

FEBRUARY 1996

# సంక్షిప్తవార్తలు

కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ 11వ వార్షిక బైబిల్ సెమినార్ జనవరి 9 నుండి 13వ తేదీ వరకు కాకినాడ విద్యుత్ నగర్ లో నూతనంగా నిర్మించ బడిన భవన సముదాయములో నున్న అత్యంత విశాలమైన సెమినార్ హాలు నందు ఘనంగా జరిగెను. 9వ తేదీ సాయంత్రం 4-00 గం॥లకు ఎయిర్ ఇండియా మరియు ఇండియన్ ఎయిర్‌లైన్స్ డైరెక్టర్ శ్రీ మంగపతి పళ్లంరాజు గారు భవన సముదాయమునకు ప్రారంభోత్సవము జరిగించిరి.

న్యూడిల్లీ, పంజాబ్, మహారాష్ట్ర, తమిళనాడు, కర్నాటక, ఒరిస్సా రాష్ట్రముల నుండియు, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలనుండియు ప్రజలు ఈ సెమినార్‌కు వేలాది సంఖ్యలో తరలివచ్చిరి. క్షేమాభివృద్ధికరమైన సందేశాలతో, క్రీస్తు సంఘము యొక్క ఔన్నత్యమును చాటుచు దేవుని మహిమపరచే గీతాలతో మిక్కిలి సౌందర్యవంతముగ నిర్మింపబడిన భవన సముదాయము ప్రతిధ్వనించెను.

సోదరులు జాన్‌ఫోర్డు, రోజర్‌రైట్, ఫ్రాన్సిన్ డేవిడ్ గార్లు, మరియు కె. మల్లిక్, ఇ.కె.వి. ప్రసాద్‌రావ్, ఐ. ఇశ్రాయేలు, పి. ప్రకాశంగార్లు దేవుని వాక్యపరిచర్యచేసిరి. సెమినార్ కాలమంతటిలోను 191 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. సోదరి నేన్సీ ఫోర్డ్‌గారు స్త్రీలకు ప్రత్యేక తరగతులు నిర్వహించి సంఘములోను సమాజములోను స్త్రీయొక్క ప్రాముఖ్యమైన పాత్రను గూర్చి వివరించిరి.

అటు తరువాత ఫోర్డ్ దంపతులు, రోజర్‌రైట్‌గారు, నెహెమ్యాగూటం దంపతులతో జనవరి 15,16 తేదీలలో విశాఖపట్టణంలోను, 17, 18, 19 తేదీలలో వరంగల్లులోను సువార్తకూటములు నిర్వహించిరి. వరంగల్లులో జరిగిన కూటములలో 373 మంది క్రీస్తు సువార్తకు లోబడిరి.

(తరువాయి టైటిలు మూడవ పేజీలో)

# సత్యవాక్యం

**THE WORD OF TRUTH**
P.o. Box 80, Kakinada, A.P. 533 001
Phone : 0884-63722

Editor :
**J.C. CHOATE**

Managing Editor :
**JOSHUA GOOTAM**

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 16 ఫిబ్రవరి 1996 సంచిక 7

## క్రీస్తు యొక్క రెండవ రాకడ

## (The second coming of Christ)

క్రీస్తు సిలువపై చనిపోయెనని సమాధిచేయబడెనని బైబిలు విపులముగా బోధించు చున్నది. అయితే ఆయన సమాధినుండి తిరిగి లేచెనని, పరమందున్న తండ్రియొద్దకు ఆరోహణుడైన రీతిగానే ఆయన తిరిగి వచ్చునని కూడా అది బోధించుచున్నది(1 కొరింథీ 15 :1-4; అ పొ.కా.1: 9-11). తాను సమాధినుండి లేతునని, మరల వత్తునని క్రీస్తే బోధించెను కూడ (మత్తయి 20:17-19; యోహాను 14:1-3).

క్రీస్తు మరల వచ్చుటనుగూర్చి అనేక సిద్ధాంతములున్నవి. అసలు ఆయనసిలువపై చనిపోలేదని కూడ కొందరు చెప్పేవారున్నారు. మరికొందరు ఆయన చనిపోయినప్పుడు చనిపోయాడు అంతే, అని చెబుతారు. అదినిజమే

అయితే సహజంగనే ఆయన తిరిగి రాడు.

కాని క్రీస్తు యొక్క మరణ సమాధి పునరుత్థానములను శంకించుట, లేఖనములలో లిఖించబడిన దైవ రికార్డును శంకించుటయే యగును. అలాగ శంకించవలసివస్తే ఒకని ముందున్న వాస్తవములను తిరస్కరించుటయే యగును.బైబిలు దేవుని ఆత్మావేశముచే లిఖించబడిన గ్రంధమని, అది ప్రభువు యొక్క మరణ సమాధి పునరుత్థానములను గూర్చిన సత్యాన్ని ప్రకటించుచున్నదనే భావముతో ఈ వ్యాసము వ్రాయబడుచున్నది. అంతే కాదు క్రీస్తు మరల వచ్చుచున్నాడని మనము నమ్ముచున్నట్లు అని కూడ దాని భావమై యున్నది.

అయితే క్రీస్తు మరల ఎప్పుడు వచ్చును? ఆయన సమాధినుండి తిరిగిలేచి ఇంచుమించు రెండువేల సంవత్సరములైపోయిందిగనుక ఆయన ఇక రాడని కొందరు తలస్తారు. అపొస్తలులు ,మొదటి శతాబ్దపు క్రైస్తవులు కూడ వారి కాలమందే ఆయన వచ్చునేమోయని ఎదురు చూచారు.అయితే ఆయనవారికాలమందుకూడ తిరిగి రాలేనందున వారి నిరీక్షణ వ్యర్ధమాయెనా? కానేకాదు. ప్రభువునకు వెయ్యి సంవత్సరములు ఒక దినమువలెను, ఒక దినము వెయ్యి సంవత్సరములవలెను ఉండునని మనము జ్ఞాపకముంచు కోవాలి (2 పేతురు 3:10). సరిగదా ఆయన ఇప్పుడు వచ్చినను, ఎప్పుడు వచ్చినను సరే నిత్యత్వముతో పోల్చితే అది బహు స్వల్పకాలమే. ఆయన త్వరలో వచ్చునని చెప్పుచున్నప్పుడు ఆయన ఇప్పుడైనా రావచ్చును లేదా కొన్ని సంవత్సరముల తరువాతైనా రావచ్చును.క్రీస్తురావడానికి ఒక లక్ష సంవత్సరములు పట్టినను మనం ఆయన త్వరలో వచ్చుచున్నాడని చెప్పవచ్చును.ఆయన ఎల్లప్పుడు ఉన్నవాడు, ఎల్లప్పుడు ఉండును. ఆయనరాకను గూర్చి మనం చెప్పునప్పుడు నిత్యత్వాన్ని దృష్టిలో యుంచుకొని చెప్పాలి.

పేతురు తన కాలమందు ఇట్లు చెప్పాడు:" అంత్య దినములలో అపహాసకులు అపహసించుచు వచ్చి, తమ స్వకీయ దురాశల చొప్పున నడచుకొనుచు,ఆయన రాకడను గూర్చిన వాగ్దానమేమాయెను? పితరులు నిద్రించినది మొదలుకొని సమస్తమును సృష్టి ఆరంభముననున్నట్టే నిలిచి యున్నదే అని చెప్పుదురని మొదట మీరు తెలిసికొనవలెను. ఏలయనగా పూర్వమునుండి ఆకాశముండెననియు నీళ్లలోనుండియు ,నీళ్లవలనను సమకూర్చబడిన భూమియు దేవుని వాక్యము వలన కలిగెననియు వారు బుద్ధిపూర్వకముగా మరతురు. ఆ నీళ్లవలన అప్పుడున్న లోకము నీటి వరదలో మునిగి నశించెను.అయితే ఇప్పుడున్న ఆకాశమును భూమియు భక్తి హీనుల తీర్పును నాశనమును జరుగు దినము వరకు అగ్నికొరకు నిలువ చేయబడినవై అదే వాక్యము వలన భద్రము చేయబడి యున్నవి .ప్రియులారా, ఒక సంగతి మరచిపోకుడి. ఏమనగా ప్రభువు దృష్టికి ఒక దినము వెయ్యి సంవత్సరముల వలెను, వెయ్యి సంవత్సరములు ఒక దినము వలెను ఉన్నవి. కొందరు ఆలస్యమని యెంచుకొనునట్లు ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాడు గాని యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు, మీ యెడల దీర్ఘ శాంతము గలవాడై యున్నాడు" (2 పేతురు 3 : 3-9).

ప్రభువు ఇంకా రాలేదు గనుక ఇక ఆయన రాడని ఊహించిన వారు ఆరోజుల్లోనే లేకపోలేదు. జల ప్రళయమును గూర్చి పేతురువారికి జ్ఞాపకం చేసాడు. జల ప్రళయం కలుగునని చెప్పిన వాక్యమే క్రీస్తుమరలవచ్చునని, ఈ భూమి అగ్నితో అంతమగునని చెప్పుచున్నది. నేడు హేళన చేయుచున్న భక్తిహీనులు ఈ హెచ్చరికను గమనించుకోవాలి.

ప్రభువుయొక్క రెండవ రాకడను గూర్చి మరింత విపరీతముగ

చెప్పేవారు లేకపోలేదు. ప్రభువు మరుక్షణంలోనే విచ్చేయనున్నట్లు వారు చెబుతారు. ఆయనను ముఖాముఖిగా చూచుటకు గొప్ప ఆసక్తి గల వారమని కూడ వారు చెబుతారు. అయితే అట్టివారు బైబిలులో కనబడని సంఘములలో యుందురు. మానవకల్పిత నామములను ధరింతురు, అబద్ధబోధలు చేయుదురు, మరియు బైబిలుకు వ్యతిరేకమైన సంగతులను ఆరాధనలో చేస్తారు. వారున్న స్థితిలోనే ప్రభువు వస్తే ఆయనను ఎదుర్కొనలేని వారు వీరే. ఆయనను ఎదుర్కొనడానికి మేము సిద్ధముగా యున్నామని వారు అనుకొంటారుగాని, నిజానికి వారు సిద్ధముగా లేరు. ప్రభువు వలన అంగీకరించబడడం అట్లుంచి, వారు తిరస్కరించ బడ్తారు.

ప్రభువు మన జీవితకాలంలో గాని, మనం వెడలిపోయిన తరువాత గాని రావచ్చును. గాని ఆయన వస్తే ఆయనను కలసికొనడానికి సిద్ధముగా యున్నామా? ఆగొప్పదినము కొరకును, దాని తరువాత జరుగు గొప్పతీర్పు కొరకును సిద్ధపడవలసిన సమయం యిదే.

## అన్నిటికంటె భయపడవలసిన ఘడియ

## ("Of all Hours fear but one")

ఫ్రాన్స్ దేశమందలి క్లూనీ నగరంలో సూర్యునిపై ఆధారపడి పనిచేసే ప్రాచీనమైన గడియారపు గోడపై జ్ఞాపకార్థమై ఆ మాటలు వ్రాయబడినవి. అన్నిటికంటె భయపడవలసిన ఘడియ ఒకటి ఉన్నది. ప్రతి వ్యక్తి తాను జీవించిన జీవితాన్ని ముగింపజేసి తన గమ్యాన్ని చేర్చే ఆఖరి సమయం ఒకటున్నది. ఎందుకనగా తాను నియమించిన మనుష్యుని చేత నీతిననుసరించి భూలోకమునకు తీర్పు తీర్చబోయెడి యొక దినమును నిర్ణయించియున్నాడు. (అ.కా 17 : 31). ప్రతిపనిని తలంపును గూర్చి వ్రాయబడిన నీ జీవితమును

గూర్చిన గ్రంధమొక్కటి దేవునివద్ద యున్నది. "ఎందుకనగా తాను జరిగించినక్రియల చొప్పన అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే దేహము తో జరిగించినవాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మన మందరమును క్రీస్తు న్యాయ పీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును" ( 2 కొరింధీ 5 :10 ప్రక 20 : 11-15).

ఆఖరి తీర్పు దినమునకు మనం సిద్ధపడవలెనని బైబిలు విశదముగ తెలియ జేయుచున్నది. అది తప్పదు అది ఎవడును మార్పు చేయలేనిది. ఖచ్చితమైన దినమునైయున్నది. దానినుండి ఎవరునూ తప్పించుకొనలేరు. తీర్పు నిమిత్తమై మనుష్యకుమారుని యొద్దకు జనములు పోగు చేయబడుదురు. (మత్తయి 25 : 32 ). పాపులు అవిశ్వాసులైన క్రైస్తవులు, క్రీస్తు వెలుపల వుండి నైతిక జీవితమును జీవించినవారు, కొరాజీనా, బేత్సయిదా, యెరూషలేము. మాస్కో లేక వాషింగ్టన్ నగరాలుగాని ఎవరైనను ఆఖరి తీర్పుకొరకు అక్కడ ఉండవలెను. (రోమా 14 : 10). అది వ్యక్తి గతమైనది. గొప్పతేజస్సు కల్గిన సింహాసనము ఎదుట నీవు ప్రత్యక్షం కావలసిన సమయం వచ్చినపుడు నీ జీవితాన్ని కనబరచునట్టి ఒక ప్రకాశమైన కాంతి నీ మీద ప్రసరింపబడుతుంది. (1 కొరింధీ 3 : 13). అప్పుడు నీకు నీవే క్రీస్తుకు విధేయుడవగుటకు, ఆయన రాజ్యమును మొదట వెదుకుటకు నీవు విఫలుడవైన పక్షంలో ఆ నేరాన్ని సమాజం పైగాని, వేషధారులైన సంఘ సభ్యులపైగాని, వ్యతిరేకముగా నున్న పరిస్థితులపై గాని మోపడానికి నీకు అవకాశం లేదు.

## గ్రంధాలు విప్పబడును

లేఖనములు ఈలాగు బోధించుచున్నవి. రాబోవు తీర్పు సంపూర్ణ మైనట్టిదై యున్నది. "గూఢమైన ప్రతి అంశమును గూర్చి దేవుడు విమర్శ

చేయునపుడు ఆయన ప్రతిక్రియను అది మంచిదే గాని చెడ్డదేగాని తీర్పులోనికి తెచ్చును (ప్రసంగి 12 : 14). మనమెవనికి లెక్క చెప్పవలసియున్నదో ఆయన కన్నులకు సమస్తమును మరుగు లేక తేటగాయున్నది (హెబ్రీ 4 : 13). పరలోకమందున్న దేవుని కంటికి కనబడకుండదాగ గలవాడెవడైనను లేడు. (యిర్మి 23 : 23,24). మానవ సామర్ధ్యము దేవుని దృష్టిలో వ్యర్ధము. క్రీస్తు రుధిర తరంగములో నీ పాపములు కడుగబడినవా ? దేవుని చిత్తమున కనుగుణముగ నీ జీవితము జీవించితివా యనునవే యిక్కడ ప్రధానాంశాలు. సంపూర్ణమైన స్థాయిలో తీర్పు జరుగును. క్రీస్తు చనిపోయిన నాటి నుండి మానవులందరికి ఆయన సువార్త ప్రకారము తీర్పు జరుగును (రోమా 2 : 16). నీకుపాత నిబంధన ప్రకారముతీర్పుతీర్చబడదు. మానవుని చేత వ్రాయబడిన విశ్వాస ప్రమాణ పుస్తకము ద్వారాగాని ,చట్టం ద్వారాగాని మానవ సమావేశాల ద్వారాగాని తీర్పు జరుగదు. ఇక్కడ మనం చదువుచున్నట్లు ఆ దినాన క్రొత్త నిబంధన చదువబడును. మార్కు16: 15–16 అక్కడ ఉన్నది. యాకోబు 1:27 అక్కడ ఉన్నది . 1 కొరింధీ 16: 1–2 అక్కడ ఉన్నది. రోమా 12 :1–2 అక్కడ ఉన్నది. యేసు చెప్పెను: " నేను చెప్పిన మాటయే అంత్యదినమందు వానికి తీర్పు తీర్చును"(యోహాను 12:48 ). ఓ తండ్రీ నీ చిత్తమును జరిగించి తినని ఆ దినాన నీవు చెప్పాలంటే ఈ దినముననే నీవు దేవుని చిత్తమునకు లోబడుట ఎంత వివేకము!

## ఆశ్చర్యాన్ని కలిగించేదినమిది

తీర్పు దినము ఆశ్చర్యాన్ని కల్గించే దినమని యేసు సెలవిచ్చెను (మత్తయి 7:22 -23). 1. ఆశ్చర్యం కల్గించే విషయమేమంటే ఆ దినాన క్షమాపణ లేదు. ఆనాడు మనం చెప్పే అవివేకమైన సాకులు దేవుని ఉగ్రతకు

దారి తీస్తాయి. దీనివిషయంలో రెండు మార్గములులేవు. విధేయుడవై నిత్యరక్షణ పొందుట గాని లేక అవిధేయుడవై నిత్యశిక్ష పొందుటగాని ఈ రెండులో ఏదో ఒక్కటే సాధ్యము. 2. మానవ కల్పిత సంఘాలను దేవుడు అంగీకరింపడనునది ఆశ్చర్యకరమైన విషయం. మన ప్రభువు స్పష్టముగా చెప్పెను: "పరలోకమందున్న నా తండ్రి నాటని ప్రతి మొక్కయు పెల్లగింప బడును" (మత్త 15 : 13). దేవుని వాక్యములో లేని సంఘాలలో వేలకొలది ప్రజలు తమ జీవితాలను గడుపుట ఎంత విషాదము!. దేవుని చిత్తమునకు విధేయుడవై యుండాలి. "నేను మిమ్మును ఎన్నడును ఎరుగను" అని ఆదినాన ఆయన చెప్పును (మత్త 7 :21-23). 3. యితరులు చేసిన కార్యములను బట్టి మనకు తీర్పు తీర్చ బడదు. యిది మరొక ఆశ్చర్యకరమైన సంగతి. భార్యరక్షణ పొందితే భర్తకు, భర్త రక్షణ పొందితే భార్యకు ఇది వర్తించదు. తల్లి దండ్రులు పొందిన రక్షణను వారి పిల్లలు వారసత్వముగ పొందలేరు. ప్రతివానికి తాను జరిగించిన క్రియల చొప్పున తీర్పు తీర్చబడును (రోమా 14 : 10-12). చాలామంది క్రైస్తవులు ప్రభువు పనిలో నమ్మకముగ పాల్గొనకుండ సంఘ సభ్యత్వమే రక్షించ గలదని అభిప్రాయ పడుచున్నారు. నీవు దేవుని పనిలో విశ్వాసముతో పాలు పొందనియెడల తీర్పు తీర్చు న్యాయాధిపతి యెదుట నీవు వ్యర్థుడవుగా కనబడుదువు. 4. మన నీతి క్రియలను బట్టి దేవుడు మనకు తీర్పు తీర్చడనునది ఆశ్చర్యం కలిగించేది. ఫేలిక్సు వంటివారు వారికి సమయమైనప్పుడు క్రైస్తవుడగుట కొరకు ఆలోచించుచున్నారు (అ.కా.24:25). సువార్తకు విధేయు డగుట కొరకు మంచి క్రైస్తవ జీవితము జీవించుటకు, మంచి సమయం కొరకు ఎదురు చూస్తువాటిని కార్య రూపంలో పెట్టక పోయిన యెడల తీర్పు సమయంలో అది నీకు పెద్ద ప్రమాదము కాగలదు (యాకోబు 2 : 14-26).

## మూడు తీర్పులు

ఆఖరి దినం చివరిలో మూడు తీర్పులు వెలువడును.

(1) "నేనుమిమ్ము్మను ఎన్నడును ఎరుగును" (మత్త 7 : 21-23) అని క్రీస్తు సువార్తకు లోబడని వారితో చెప్పును.

(2) "మిమ్ము్మను ఎరుగను (మత్త 25 : 12). ఒకసారి సిద్ధపడి ఆరిపోయిన దివిటీలు పట్టుకొనిన వారి కివ్వబడిన తీర్పు.

(3) "నీ యజమానుని సంతోషములో పాలుపొందుము" (మత్త 25 :21). నమ్మకమైన మంచి దాసులు వినునట్టి ఆనందదాయకమైనమాటలు.

## నీవు సిద్ధముగ నున్నావా ?

నాస్నేహితుడా నీవు ఎలా ఉండాలని కోరుకుంటున్నావు ? తీర్పులో దేవునిని కలుసు కొనుటకు సిద్ధపడియున్నావా లేదా ? ఏదోదినాన సిద్ధపడాలని అనుకొను చున్నావా ? దేవునిని కలుసుకొనుటకు ఇప్పడే సిద్ధపడి ఉన్నావా ? దేవుడు నిన్ను ప్రేమించి తన అద్వితీయ కుమారుడు నీ కొరకు చనిపోవునట్లు ఆయనను పంపెను (యోహాను 3:16). ఆయన రక్షణ మార్గాన్ని యిచ్చెను. విశ్వసించి పాపముల విషయమై మారుమనస్సు పొంది (లూకా 13 :3) క్రీస్తు ప్రభువని ఒప్పుకొని (రోమా 10 :10) బాప్తీస్మములో పాపక్షమాపణ కొరకు ఆయనతో కూడా పాతి పెట్ట బడవలెను (అ.కా 2:38, రోమా 6:3-4). విధేయుడవైతే దేవుడు నిన్ను సంఘముతో చేర్చును ( అ.కా.2:47). ఆయనపనిలో నమ్మకమైన జీవితాన్ని నీవు జీవించినట్లయితే గొప్ప సంతోషముతో తీర్పుదినాన ప్రభువును కలిసికొనగలవు.

సృష్టికర్తను కలిసి కొనుటకు జీవితంలో సిద్ధపడి ఉండుటయే నీయొక్క గొప్ప బాధ్యత. ఈ దినం దూరంగా లేదనునది ఆశ్చర్యం కలిగించే సత్యం. రహదారిపై నీప్రయాణంలో తరువాత మలుపు వద్ద మరణాన్ని ఎదుర్కొన బోతున్నావు. "రాత్రి చాలా గడచి పగలు సమీపముగా నున్నది." (రోమా 13 :12) అక్కడ దేవునితో కలిసి ఉంటావు. రాబోయే గొప్పదినానికి నిన్ను సిద్ధపరచడానికి క్రీస్తు సంఘాలు ఎదురుచూస్తున్నాయి.

- మేక్ లేటన్.

# రహస్యమున ధర్మము చేయుట

# Alms Giving In Secret

## (మత్తయి 6:1-4)

యేసుప్రభువు కొండమీద చేసిన ప్రసంగమును మత్తయి 5,6,7 అధ్యాయాల్లో మనము కనుగొన గలము. ఇంతవరకు మత్తయి 5వ అధ్యాయములో 19 ప్రాముఖ్యాంశములను గూర్చి ఈ మాస పత్రిక ద్వారా నేర్చుకొని యున్నాము. ఈ రోజు మత్తయి 6 :1-4 వరకు చదువు కొని ధ్యానించుదాము. ప్రభువు ఈలాగు చెప్పారు :

"మనుష్యులకు కనబడవలెనని వారి యెదుట మీనీతి కార్యము చేయకుండ జాగ్రత్తపడుడి; లేనియెడల పరలోక మందున్న మీ తండ్రి యొద్ద మీరు ఫలము పొందరు. కావున నీవు ధర్మము చేయునప్పుడు, మనుష్యుల వలన ఘనత నొందవలెనని వేషధారులు సమాజ మందిరములలోను వీధులలోను చేయులాగున నీముందర బూర ఊదింపవద్దు; వారు తమ ఫలముపొంది యున్నారని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. నీవైతే ధర్మము చేయునప్పుడు, నీధర్మము రహస్యముగా నుండు నిమిత్తము నీకుడి చెయ్యి చేయునది నీయెడమ చేతికి తెలియక యుండవలెను. అట్లయితే రహస్యమందు చూచు నీ తండ్రి నీకు ప్రతిఫలమిచ్చును".

మనుష్యులకు కనబడవలెనని నీతి కార్యములు, ధర్మకార్యములు చేయుటను యేసు ప్రభువు ఇక్కడ ఖండించియున్నారు. క్రైస్తవుని నీతి, శాస్త్రుల

యొక్కయు పరిసయ్యుల యొక్కయు నీతికి మించినదై యుండాలి . వారైతే తమ నీతి కార్యములు, ధర్మ కార్యములు మనుష్యుల ముందర వారికి కనబడేలాగున చేసేవారు. క్రీస్తు అనుచరులు ఆలాగున ఉండరాదు. మనుష్యుల ఎదుట మన వెలుగును ప్రకాశింప జేయాలని చెప్పబడింది, నిజమే. పవిత్రమైన జీవితం యొక్క ప్రభావం చాలగొప్పది. దాన్ని ఎవరు దాచిపెట్టలేరు. కొండమీద నుండు పట్టణం మరుగైయుండనేరదు. అందువలన పరలోకమందున్న పరిశుద్ధ దేవుడు మహిమ పరచబడునట్లు క్రైస్తవులు తమ సత్క్రియలను చేయుటను ఏసు ప్రభువు ఖండించలేదు గాని ఆక్రియల యొక్క ఉద్దేశం, కేవలం మనుష్యులకు కనబడాలని మాత్రమే చేస్తే వాటిని ఆయన ఖండించారు. మనుష్యులవలన ఘనత పొందాలని, మెప్పుపొందాలని వారి యెదుట చేయబడే నీతి కార్యములు, నీతి కార్యములు కానేకావు. అవన్నీ బహిరంగ నాటకీయములే. వాటికి లోతు వుండదు. యదార్థత ఉండదు.

ప్రతి నైతిక క్రియకు రెండు భాగములుంటాయి బహిర్గతము, అంతరంగికము. మనం బహిర్గతాన్ని మాత్రమే చూడగలుగుతాము. అదిమనకు బాగానే కన్పడ వచ్చును. గానిదాని అంతరంగిక ఉద్దేశ్యము సరియైనది కాకపోతే అది దేవునికి హేయము. ఒకడు చేయు కార్యమునకు ఆత్మీయ విలువను శక్తిని, బలమును యిచ్చేది, ఆక్రియ వెనుకనున్న ఉద్దేశ్యమవుతాది. హృదయంలోని ఉద్దేశ్యము పవిత్రమైన దయితే అది చేయు కార్యము దేవుని దృష్టిలో సుందరమైనది, పవిత్రమైనది అవుతాది. అంతరంగ ఉద్దేశ్యము స్వార్థముతో కూడినదయితే అది చేయు కార్యము మానవులకు ఎంత ఘనంగా కనపడినను ఆత్మీయంగా అది నిష్ప్రయోజనం. పరలోకమందున్న తండ్రినుండి దానికి కలుగు ఫలం శూన్యం.

## వేషధారులు ఆడేనాటకం

తప్పుడు ఉద్దేశ్యములతో పని చేయువారు వేషధారులు. వారు చేయునదంతయు అబద్ధమే. కావున నీవు ధర్మము చేయునప్పుడు వేషధారుల వలె నీముందర బూర ఊదింపవద్దు అని ప్రభువు చెప్పారు. వేషధారియైన వాడు మనుష్యుల యెదుట ఆడే నాటకం ఒక భాగం, తనది కాని వ్యక్తిత్వాన్ని అతడు ధరింపబూనుకొంటాడు. అతడు వీధులలో ధర్మము చేయవచ్చును, గాని దాన్ని అంతా మనుష్యులు చూడాలని కోరుకొంటాడు. బీదలను గూర్చి అతడు తన హృదయంలో ఏమాత్రం జాలి పడడు. అతడు దయగలవాడు కూడ కాదు. మంచి చేయాలని నిజంగా అతడు అనుకొనడు. మనుష్యుల వలన ఘనత పొందాలనేదే అతనికున్నా కోరిక అంతా. అయితే దేవుడు హృదయాన్ని పరిశీలిస్తాడని అతడెరుగడు. అతడు సమాజమందిరములలోను, సంఘములోను బీదలకొరకు యిస్తాడు. అక్కడ కూడ సమస్తాన్ని చూచుచున్న దేవుని యొక్క ఉనికిని మరచి, తనయొక్క ఘనతనే కోరుకొంటాడు. అట్టివారు తమ ఫలము పొందియున్నారని నిశ్చయముగా మీతో చెప్పుచున్నానని, మన ప్రభువు అన్నారు.

## నిష్కపటులు కోరేది దేవుని ఘనత

శుద్ధహృదయంతో నీతి కార్యములు, ధర్మకార్యములు చేయువారి ఉద్దేశ్యం ఒకే ఒక్కటి. అది దేవుని ఘనత. క్రైస్తవుడు యిచ్చేటప్పుడు ప్రేమ కలిగి యిస్తాడు. దేవుని యెడల, తోటి మానవుని యెడల ప్రేమ కలిగి యిస్తాడు. అతడు మనుష్యుల మెప్పును కోరడు. అతడు నిష్కపట హృదయంతో, వినయము కలిగి యిస్తాడు. అతడు సాధ్యమైనంత మట్టుకు మనుష్యులకు కనబడ కుండా తన ధర్మకార్యములు చేయగోరతాడు. ఏలయనగా అతడు విశ్వాసము వలన జీవిస్తాడు. విశ్వాసము అదృశ్యమైన సంగతుల ఉనికిని

నమ్ముతాది. అతడు అదృశ్యదేవుని సమక్షమున ఎల్లప్పుడు జీవిస్తాడు గనుక ఎల్లవేళలా ఆయననే సంతోష పెట్టుటకు ప్రయత్నం చేస్తాడు.

నీవైతే ధర్మము చేయునప్పుడు, నీ ధర్మము రహస్యముగా నుండు నిమిత్తము నీకుడి చెయ్యి చేయునది నీయెడమ చేతికి తెలియక యుండవలెను. అట్లయితే రహస్యమందు చూచు నీ తండ్రి నీకు ప్రతి ఫలమిచ్చును అని యేసు ప్రభువు బోధించారు. మన తండ్రియైన దేవుడు రహస్యమందు చూచుచున్నాడు. సూర్యుని క్రింద ఆయనకు మరుగైనది ఏదియులేదు. యిది చాల భయంకరమైన వాస్తవము. ఆయన మన జీవితము యొక్క అసలైన భావాన్ని ఎరిగినవాడు. మన తలంపుల యొక్కయు, క్రియల యొక్కయు అసలైన ఉద్దేశాన్ని ఎరిగినవాడు. ఆయన యెదుట మనం ఏవిధమైన వేషాన్ని ధరించలేము. వేషధారియొక్క ముసుకు ఆయనకు తెలుసు. అతని హృదయంలో యున్న స్వార్థం, అహంకారం ద్వేషం వగయిరా అన్నీ ఆయనకు తెలుసు.

## బహిరంగ ప్రతిఫలం

దేవుడు రహస్యమందు చూచుచున్నాడు. ఆ అదృశ్యదేవుని సన్నిధిలో ఆయనకు వినయ విధేయతలు గలిగి జీవించువారిని ఆయన ఎరుగును. ఆయన రహస్యమందు చూచుచున్నా, వారికి బహిరంగముగానే ప్రతిఫలము దయచేయును. "తన మహిమతో మనుష్య కుమారుడును, ఆయనతో కూడ సమస్త దూతలును వచ్చునప్పుడు ఆయన తన మహిమగల సింహాసనము మీద ఆసీనుడైయుండును. అప్పుడు సమస్తజనములు ఆయన యెదుట పోగు చేయబడుదురు. గొల్లవాడు మేకలలో నుండి గొర్రెలను వేరు పరచునట్లు ఆయన వారిని వేరు పరచి తనకుడివైపున గొర్రెలను ఎడమవైపున మేకలను నిలువ బెట్టును. అప్పుడు రాజు తన కుడివైపున ఉన్నవారిని చూచి - నాతండ్రి

చేత ఆశీర్వదింపబడిన వారలారా, రండి లోకముపుట్టినది మొదలుకొని మీకొరకు సిద్ధ పరచబడిన రాజ్యమును స్వతంత్రించుకొనుడి. నేను ఆకలిగొంటిని, మీరు నాకు భోజనముపెట్టితిరి; దప్పిగొంటిని నాకు దాహమిచ్చితిరి; పరదేశినై యుంటిని నన్ను చేర్చు కొంటిరి; చెరసాలలో ఉంటిని నాయొద్దకు వచ్చితిరని చెప్పును". అప్పుడు వారు ప్రభువా ఇవన్నీమేము నీకు ఎప్పుడు చేసాము అని చెప్పి ఆశ్చర్యపోవుదురు. " అందుకు రాజు మిక్కిలి అల్పులైన యీనా సహోదరులలో ఒకనికి మీరు చేసితిరి గనుక నాకును చేసితిరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను" అనును. ఆయన ఎడమవైపున ఉండువారిని చూచి శపింపబడిన వారలారా, నన్ను విడిచి, అపవాదికిని వాని దూతలకును సిద్ధపరచబడిన నిత్యాగ్నిలోనికి పోవుడియని చెప్పును. వీరు నిత్యశిక్షకును, నీతిమంతులు నిత్యజీవమునకును పోవుదురు (మత్తయి 25:31 - 46).

ఆయన యిచ్చు నిత్యజీవము ఒక బహుమానము. అది దేవుని బహుమానము. మానవులు దేవునికి చేయు పరిచర్యకు మించి కొన్ని కోటాను కోట్ల రెట్లు గల బహుమానము అది. దానికి మనం తగము. గాని ఆయన కృపవలననే దానిని మనకిచ్చుచున్నాడు.

మనం ధర్మము చేయాలని ఆయన కోరుచున్నాడు. అక్కరగలవానికి పంచి పెట్టుటకు మన చేతులతో అందుకే కష్టపడి పనిచేయాలి (ఎఫెసీ 4 : 28). ధర్మకార్యాలు దేవునికి తెలిస్తే చాలు, మానవులకు తెలియనక్కర్లేదు. అవి వ్యక్తిగత కార్యములు : అందువలననే పుచ్చుకొనుటకంటె యిచ్చుటమంచిది అని లేఖనములు చెప్పుచున్నవి. దేవుడు నిన్ను, నీధర్మకార్యములను అంగీకరించాలంటే నీవాయనను ముందు అంగీకరించాలి. యేసు ప్రభువునందు విశ్వసించాలి, నీపాపముల విషయమై మారుమనస్సు పొందాలి. పాపక్షమాపణనిమిత్తం బాప్తిస్మము పొందాలి. ఆయన సంఘ సభ్యుడవై ఆయన మహిమ కొరకు జీవించాలి !!

- జాషువా గూటం

# క్రీస్తుయాజకత్వము
# మెల్కీసెదెకు క్రమము
# (Christ's Priesthood and order of Melchizedek)

"పవిత్రుడు, నిర్దోషియు, నిష్కల్మషుడును, పాపులలో చేరక ప్రత్యేకముగా ఉన్నవాడును, ఆకాశ మండలముకంటె మిక్కిలి హెచ్చయిన వాడునైన యిట్టి ప్రధాన యాజకుడు మనకు సరిపోయినవాడు" (హెబ్రీ 7 : 26). "మనకు అట్టి ప్రధానయాజకుడు ఒకడున్నాడు ఆయన పరిశుద్ధాలయమునకు అనగా మనుష్యుడు కాక ప్రభువే స్థాపించిన నిజమైన గుడారమునకు సంచారకుడై యుండి పరలోకమందు మహామహుని సింహాసనమునకు కుడి పార్శ్వమున ఆసీనుడాయెను " (హెబ్రీ 8:2). యూదా గోత్రమందు జన్మించిన వారెవరును బలిపీఠము నొద్ద పరిచర్యచేయలేదు. మన ప్రభువు యూదా సంతానమందు జన్మించెననుట స్పష్టమే. ఆ గోత్ర విషయములో యాజకులను గూర్చి మోషే యేమియు చెప్పలేదు (హెబ్రీ 7:13-14). అయితే ఏ క్రమము చొప్పున క్రీస్తు ప్రధానయాజకుడై తన పరిచర్యను జరిగించెనో లేఖనములు చక్కని వివరాన్ని తెలియజేయుచున్నవి. "మేకల యొక్కయు కోడెల యొక్కయు రక్తముతో కాక తన స్వరక్తముతో ఒక్కసారే పరిశుద్ధ స్థలములో ప్రవేశించెను" (హెబ్రీ 9:12). "ప్రధాన యాజకుడు ప్రతి సంవత్సరము తనది కాని రక్తము తీసికొని పరిశుద్ధస్థలములోనికి ప్రవేశించునట్లు, ఆయన అనేక పర్యాయములు తన్ను తాను అర్పించుకొనుటకు ప్రవేశింపలేదు"(హెబ్రీ 9 : 25).

"మరియు షాలేము రాజైన మెల్కీసెదెకు రొట్టెను ద్రాక్షారసమును తీసుకొని వచ్చెను. అతడు సర్వోన్నతుడగు దేవునికి యాజకుడు" (ఆది 14:18). "ఆ షాలేమురాజును మహోన్నతుడగు దేవుని యాజకుడైన మెల్కీసెదెకు నిరంతరము యాజకుడుగా ఉన్నాడు .......... అతడు తండ్రిలేని వాడును తల్లిలేని వాడును వంశావళిలేని వాడును జీవితకాలమునకు ఆదియైనను, జీవమునకు అంతములేని వాడునైయుండి దేవుని కుమారుని పోలియున్నాడు.

ఇతడెంత ఘనుడో చూడుడి. మూల పురుషుడైన అబ్రాహాము అతనికి కొల్లగొన్న శ్రేష్ఠమైన వస్తువులలో పదియవ వంతు ఇచ్చెను"( హెబ్రీ 7:3-4). క్రీస్తు ఏ క్రమమును బట్టి నిరంతరము యాజకుడైయుండెనో దావీదు మాటలలో నుండి చదువుదాం: "మెల్కీసెదెకు క్రమము చొప్పున నీవు నిరంతరము యాజకుడవై యుందువని యెహోవా ప్రమాణము చేసియున్నాడు. ఆయన మాట తప్పనివాడు" (కీర్త 110:4-5). ఆదికాండము మొదలుకొని హెబ్రీ పత్రిక వరకు మరియు ప్రకటన గ్రంథం వరకు ఒక చక్కని ఐక్యత అనే బంగారు తీగచేయబడింది. యింత పురాతన గ్రంథం ఆధునికులకు మార్గదర్శకంగా ఉండుటకు కారణం యిది దేవుని గ్రంథం. వేల సంవత్సరాల వ్యవధిలో ఒకరి కొకరు తెలియక పోయిన క్రీస్తు యాజకత్వము గూర్చి మెల్కీసెదెకు క్రమమును గూర్చి మోషే, దావీదు, హెబ్రీ లేఖకుడు ఒకే విషయం తెలియజేసిరి. యిది గొప్ప గ్రంథం అనుటకు అందలి ప్రతి అక్షరం ఋజువుగా ఉన్నది. ఇందువలన పరలోక సంబంధమైన పిలుపులో పాలుపొందిన పరిశుద్ధ సహోదరులారా మనము ఒప్పుకొనిన దానికి అపొస్తలుడును ప్రధాన యాజకుడునైన యేసు మీద లక్ష్యముంచుడి"( హెబ్రీ 3:1 )."యాజకులు మార్చబడిన యెడల అవశ్యముగా యాజక ధర్మము సహా మార్చబడును" (హెబ్రీ 7:12). రాతిపలకల మీద వ్రాయబడిన నిబంధనకు హృదయముల మీద వ్రాయబడిన నిబంధనకు, లోపముగల నిబంధనకు శ్రేష్ఠమైన నిబంధనకు, ఛాయా రూపానికి, నిజ స్వరూపానికి మధ్య లేఖనాలు వివరించే వ్యత్యాసాన్ని గ్రహించ లేని వారు పాతనిబంధన అమలులో నున్న చట్టంగా భావించే వారు ధర్మశాస్త్రంలో కొంతభాగం మనం ఆచరించాలని బోధించి సవాలు చేసేవారు క్రొత్తనిబంధన పరించి ఆయన సంకల్పాన్ని ఉన్నది ఉన్నట్లు గ్రహించ వలసిన వారై యున్నారు.

క్రీస్తు ప్రధాన యాజకుడైతే క్రైస్తవులు యాజకులై యున్నారు. "యేసుక్రీస్తు ద్వారా దేవునికి అనుకూలములగు ఆత్మ సంబంధమైన బలుల నర్పించుటకు

పరిశుద్ధ యాజకులుగా ఉండునట్లు మీరును సజీవమైన రాళ్ళవలెనుండి ఆత్మ సంబంధమైన మందిరముగా కట్టబడుచున్నారు." (I పేతురు 2:5). "అయితే మీరు చీకటిలో నుండి ఆశ్చర్యకరమైన తన వెలుగు లోనికి మిమ్మును పిలిచినవాని గుణాతిశయములను ప్రచురము చేయు నిమిత్తము, ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజకసమూహమును పరిశుద్ధ జనమును, దేవుని సొత్తయిన ప్రజలునై యున్నారు" (I పేతు 2:9).

ప్రధాన యాజకుడైన క్రీస్తునొద్ద నీవును యాజకుడవు కావాలంటే విని, విశ్వసించి మారుమనస్సు పొంది, క్రీస్తును ఒప్పుకొని పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. తడవుచేయుట ఎందుకు? (అపొ.కా.22:16).

-ఇ.వి.కె. ప్రసాదరావు, చెయ్యేరు.

## ఎవరు గమనించుచున్నారు?

## (Who is Watching ?)

కొన్ని సంవత్సరముల క్రితము మేము ఒక గ్రామ ప్రాంతములో ఇల్లు కట్టు కొనుచున్నాము. ఒక రోజు పనివారంతా వారివారి పనులలో నిమగ్నమై యున్నపుడు మాకు కొంత దూరములో ఉన్న ఒక పొరుగింటాయన మా వద్దకు వచ్చాడు. "నేను ఇక్కడ ఏమి జరుగు తున్నదో చూచుటకు వచ్చాను. నా బైనాక్యులర్లు దీనిని చూచుటకు శక్తివంతముగా లేవు" అని చిరునవ్వు నవ్వుతూ చెప్పెను.

నీవు ఎవరివైనను, లేక నీవు ఏమి చేయుచున్నను నిన్ను ఎవరో ఒకరు గమనించుచున్నారన్నది నిజమైయున్నది. ఆయన కొరకు మంచి కార్యములు చేయుటకు ఇతరులను ప్రేరేపించుటకు మనలను ఏవిధముగా వాడుకొనవలెనో దేవుడు సూచించుచున్నాడు.

## అపవాది గమనించుచున్నాడు

మొట్టమొదటిగా సాతాను ఆదాము హవ్వలను ఏదేను వనములో వారిని శోధించుటకు సమయము కొరకు కనిపెట్టుచున్నపుడు జరిగినది. అప్పటినుండి సాతాను దేవుని ఆజ్ఞలను అనుసరించి జీవించు ప్రజల కొరకు నిద్రపోకుండా యున్నాడు.

సాతాను అపోస్తలులను కనిపెట్టిచూచినాడు. యేసు పేతురును ఈవిధముగా హెచ్చరించి యున్నాడు : "సీమోను, సీమోను, ఇదిగో సాతాను మిమ్ము్మను పట్టి గోధుమల వలె జల్లించుటకు మిమ్ము్మను కనిపెట్టు కొనెను" (లూకా 22 : 31). యూదా దేవుని కుమారుని ముప్పది వెండిరూకలకు శత్రువులకు అప్పగించుటకు సమర్థుడని సాతాను బాగుగా ఎరిగెను. ఇప్పుడు క్రీస్తు అనుచరులను సాతాను కనిపెట్టుట లేదు అనుటకు ఏమైనా కారణమున్నదా?

బైబిలు అంతటి యందు దేవుని ప్రజలు ఆయా సమయములందు గమనింపబడిరి అనుటకు అనేక ఉదాహరణలు గలవు. ఎస్తేరు గ్రంథములో మొర్దెకై యూదుడైనందున హామాను అతనిని గమనించి అతడు హామానుకు నమస్కరించనందువలన మొర్దెకైను అసహ్యించుకొని మొర్దెకైను చంపుటకు ప్రణాళికను వేసెను. ఆ ఉద్దేశము నెరవేరలేదు. కాని మొర్దెకై బదులు హామాను ఉరి తీయబడెను.

## ప్రజలు గమనించుచున్నారు

దానియేలు మరియు అతని స్నేహితులు ప్రతిమకు నమస్కరించుమనే ఆజ్ఞకు లోబడుటకు బదులుగా వారు నిజదేవునికి ప్రార్థించిరి. సింహాముల గుహగాని, భయంకరమైన అగ్నిగుండముగాని వారికి హాని కలుగ జేయలేదు.

ప్రతీసారి హెబ్రీయులైన ఈ ప్రజలు దేవుని యందు నమ్మికయుంచుట వలన,ఆ రాజులు విశ్వాసులుగా మారిరి.

యేసు వెళ్ళిన ప్రతీచోట ప్రజలు ఆయనను గమనించుచుండిరి. కొందరు ఆయనను ఎలాగైనను పట్టుకొనవలెనని చాలామంది ఆయన ప్రతి కదలికను జాగ్రత్తగా గమనించుచుండిరి. చాలా మంది జనసమూహము ఆయనను గూర్చి తెలిసికొనవలెనని కోరిక కలిగియుండిరి. "నన్ను చూచిన వాడు నా తండ్రిని చూచియున్నాడని" యేసు చెప్పెను (యోహాను 14:9). యేసు శాంతము, దయ, ప్రేమ గలవాడు మరియు ప్రతీ ఒక్కరికొరకు జాగ్రత్త వహించినవాడు. ఆయనను అనుసరించువానికి ఈ లోకమందు మంచి జీవితమును, పరలోక మందు నిత్యజీవమును అనుగ్రహిస్తానని వాగ్దానము చేసెను.

యేసు చనిపోయి, తిరిగిలేచి పరలోకమునకు ఆరోహణ మయిన తరువాత అపోస్తలులు ఆయన మానవులకొరకు చేసిన గొప్ప కార్యమును గూర్చి ప్రచురించుచుండిరి. వారి జీవితము, వారి బోధలు అనేక మంది రక్షణ పొందుటకు దోహద పడినవి.

## క్రైస్తవులు గమనించబడాలి

క్రైస్తవులు గమనించబడవలెనని యేసు కోరుచున్నాడు. ఆయన కొండమీద ప్రసంగములో (మత్తయి 5 వ అధ్యా) ఈలాగు చెప్పుచున్నాడు: "మీరు లోకమునకు వెలుగై యున్నారు". క్రైస్తవుని వెలుగు యొక్క ఉద్దేశమేమనగా ప్రకాశింప బడుట మాత్రమే గాక పరీక్షింపబడవలెను. "మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోక మందున్న మీ తండ్రిని మహిమ పరచు నట్లు వారి ఎదుట మీ వెలుగును ప్రకాశింపయుడి" అని ఆయన చెప్పెను.

అవిధేయులైన భర్తగల స్త్రీకి పేతురు ఈ విధముగా సలహా ఇచ్చుచున్నాడు "స్త్రీలారా మీరు మీస్వ పురుషులకు లోబడి యుండుడి. అందువలన వారిలో ఎవరైనను వాక్యమునకు అవిధేయులైతే, వారు భయముతో కూడిన మీ ప్రవర్తన చూచి వాక్యము లేకుండనే తమ భార్యల (I పేతు 3:21) నడవడి వలన రాబట్టబడ వచ్చును."

## మంచి మాదిరి అవసరము

ప్రస్తుతము మనము అనేక మాదిరికరమైన కార్యములను గూర్చి వినుచున్నాము. చాలాకాలమునుండి తల్లిదండ్రులు వారి పిల్లలకు క్రమ శిక్షకులుగా యుండుట కంటే వారితో స్నేహితులుగా ఉండుట మంచిదని నమ్ముచున్నాము. పిల్లలను మంచిగా పెంచుట అనునది ప్రశ్నార్ధకమై యున్నది. తల్లిదండ్రులు వారి పిల్లలకు మంచి మాదిరి గా యుండవలసిన అవసరతను వారు గుర్తించాలి.

పౌలు తిమోతియొక్క తల్లి మరియు అవ్వయొక్క మాదిరిని పొగడు చున్నాడు. II తిమోతి 1 : 5 లో పౌలు ఈలాగు వ్రాయుచున్నాడు : "ఆ విశ్వాసము మొదట నీ అవ్వయైన లోయిలోను, నీ తల్లియైన యూనీకే లోను వసించెను. అది నీయందు సహా వసించుచున్నది. దీనిని నేను రూఢిగా నమ్ముచున్నాను."

తల్లిదండ్రులు తమపిల్లలను పెంచుటలో పొరపాట్లు చేసినప్పటికి, వారు మరి శక్తివంతముగా వారిని ప్రభావితంచేయాలి. పాత నిబంధన గ్రంధములో దావీదు యొక్క పాపములు ఎన్నో అందరు గమనించగల్గునట్లు లిఖింపబడి యున్నది. కాని నిజానికి అతడు ఎల్లప్పుడు నిజదేవుని వెంబడించినవాడని మనము జ్ఞాపకము చేసికొనవలెను. అతని కుమారుడైన సొలోమోను,అతని

వంశీకుడైన యెహోషాపాతు ఆయన మాదిరిని అనుసరించారు గనుక వారు శ్లాఘించబడినారు. I రాజు 9 : 4 మరియు II దిన వృత్తా 17 : 3 ఈ సత్యాన్ని రూఢి పరచు చున్నది.

## . నీ మాదిరి యెట్టిది ?

క్రైస్తవులకు క్రీస్తు మాదిరి యైనట్లయిన మనము ఇతరులచే ప్రేరేపింప బడుదుము. అదే సమయములో మనము మాదిరిగా యుందుము. ఆత్మలను వెదకుటలో మనమాదిరి వారిని ప్రేరేపించు చున్నాదా ? లేక నిరుత్సాహ పరచు చున్నాదా ?

ఈ మధ్య నేను ఒక స్నేహితురాలికి ఒక సమాచారము పంపితిని. ఆమె యొక్క భక్తి ప్రభువు పనికై ఆమె పడుప్రయాస నన్ను ప్రేరేపించినది అని వ్రాసితిని. ఆమె చాలా ఆశ్చర్యపడినది. ఏ ఒక్కరికీ తాను ప్రేరణగా యున్నట్లుగా తాను గమనించలేదు.

"సహోదరులారా, మీరు ప్రేమయందు మరి ఎక్కువగా అభివృద్ధి చెందవలెననియు, సంఘమునకు వెలుపటివారి యెడల మర్యాదగా నడుచు కొనుచు మీకేమియు కొదువలేకుండునట్లుమేము మీకాజ్ఞాపించిన ప్రకారము పరుల జోలికి పోక, మీ సొంత కార్యములను జరుపుకొనుట యందును మీ చేతులతో పని చేయుట యందును ఆశకలిగియుండవలెననియు మిమ్మును హెచ్చరించుచున్నాము (I థెస్స 4 : 11 , 12 ).

- ఫ్రాన్సిస్ పార్ (Vot)

# బైబిలును ఎందుకు చదువ వలయును ?

బైబిలు గ్రంథము దైవ సంకల్పము, అది మానవుని స్థితి, రక్షణ మార్గము, పాపాత్ముల నరక యాతన మరియు విశ్వాసుల ఆనందము బయలు పరచు గ్రంథమై యున్నది. దీని యొక్క సిద్ధాంతములు పరిశుద్ధమైనవి, ఇందలి ఆజ్ఞలు అనుసరించ తగినవి, ఇందలి చరిత్రలు నిజమైనవి, నిర్ణయాలు నమ్మకమైనవి. మరి విశేషంగా ఈ గ్రంథమందలి ప్రతిమాట కూడ దేవుని మాటగా మనము గ్రహించ వలయును. బైబిలు గ్రంథము చదువుటకు గల కారణములు ఈ దిగువ వ్రాయబడినవి.

## 1. ఇది దైవ ప్రేరేపితము

"ఒకడు తన ఊహను బట్టి చెప్పుట వలన లేఖనములో ఏ ప్రవచనము పుట్టదని మొదట గ్రహించుకొనవలెను. ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛను బట్టి కలుగలేదుగాని మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడిన వారై దేవుని మూలముగ పలికిరి". (2 పేతురు 1:20-21). అపొస్తలుడైన పౌలు తిమోతికి రెండవ లేఖ వ్రాస్తు.. "దైవ జనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము, ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతి యందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమైయున్నది" (2 తిమోతి 3:16-17) అని చెప్పెను. పై వాక్యములను పరిశీలించగా ఈ గ్రంథములోని వాక్యములు దేవుడే తన శ్వాసను మనుష్యునిలోనికి ఊదుట ద్వారా ఆ మనుష్యులు దేవున్ని వారిలో ధరింప జేయబడి, వారి ప్రతి అవయవము కూడ దేవుని అధీనములో ఉంచబడి, దేవుని ఉద్దేశము మానవుల పట్ల ఏల ఉందో అదే వ్రాయబడినది. ఆ క్రియయే దైవావేశము లేక పరిశద్ధాత్మ ప్రేరేపణ. "మీ తండ్రి ఆత్మ మీలో ఉండి మాటలాడు చున్నాడేగాని మాటలాడువారు మీరు కారు" (మత్తయి 10:20).

పై లేఖనములే కాక ఇంకా పరిశుద్ధ గ్రంథములోని అనేకమైన పుస్తకములలో ఈ గ్రంధము దేవుని వాక్యమని, మానవులకు దేవుని సంకల్పమును తెలియజేయునని వ్రాయబడియున్నది. అందుకే ఈ గ్రంథము సత్యమైనది, పరిశుద్ధమైనది. అందుకే ఒక గ్రంధకర్త ఇలా వ్రాస్తున్నాడు. ఒక మనిషి విజ్ఞాన వంతుడు కావాలంటే ఈ గ్రంథమును చదువ వలయును. రక్షణలో కొనసాగాలంటే ఇందలి మాటలను నమ్మవలయును. పరిశుద్ధంగా ఉండాలంటే ఇందలి వాక్యములను గైకొనవలెను.

## 2. ఇవి దేవుని ఆజ్ఞలు

"ఎవడైనను తాను ప్రవక్తననియైనను ఆత్మసంబంధిననియైనను తలంచు కొనిన యెడల నేను మీకు వ్రాయుచున్నవి ప్రభువు యొక్క ఆజ్ఞలని అతడు దృఢముగా తెలిసికొనవలెను" (1 కొరింథీ 14:37). జ్ఞాని యైన సాలోమోను ప్రసంగి గ్రంథాన్ని ముగిస్తూ "ఇదంతయు వినిన తర్వాత తేలిన పలితార్థమిదే. దేవుని యందు భయభక్తులు కలిగి యుండి ఆయన కట్టడలననుసరించి నడుచు చుండవలెను, మానవ కోటికి ఇదియే విధి" (ప్రసంగి 12:13) అని వ్రాసాడు. మరియు అపోస్తలుడైన పౌలు ఇలా వ్రాసాడు. "సహోదరులారా, నేను ప్రకటించిన సువార్త మనుష్యుని యోచన ప్రకారమైనది కాదని మీకు తెలియజెప్పుచున్నాను! మనుష్యుని వలన దానిని నేను పొందలేదు, నాకెవడును దాని బోధింపను లేదు. గాని యేసుక్రీస్తు బయలు పరచుట వలననే అది నాకు లభించినది." (గలతీ 1:11-12). కనుక బైబిలు గ్రంథమందలి ఆజ్ఞలు దేవుని ఆజ్ఞలు.

## 3. వాక్యము చదువుట క్రైస్తవ కర్తవ్యమై యున్నది.

"దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించువానిగాను నిన్ను నీవే దేవునికి కనుపరచుకొనుటకు జాగ్రత్త పడుము" (2 తిమోతి 2:15). అనగా వాక్యమును సరిగా అర్థము చేసికొని సరియైన విధంగా బోధించుటకు సామర్థ్యము సంపాదించుట ఆవాక్య, సందర్భము అనగా ఎవరు మాట్లాడుచున్నారు ?

ఎందుకు మాట్లాడుచున్నారు ? పై విషయాలు అర్థం చేసికొని అదేవిధంగా బోధించుటకు యోగ్యత సంపాదించవలసిన బాధ్యత ప్రతి క్రైస్తవునికి ఉన్నది.

## 4. వాక్యమును నేర్చుకొన వలెను, దాని యందు నిలకడగా ఉండవలెను.

"విశ్వాసము ద్వారా రక్షణార్థమైన జ్ఞానము నీకు కలిగించుటకు పరిశుద్ధలేఖనములను బాల్యము నుండి నీ వెరుగుదువు గనుక, నీవు నేర్చుకొని రూఢియని తెలిసికొన్నవి యెవరి వలన నేర్చుకొంటివో ఆ సంగతి తెలిసికొని, వాటియందు నిలుకడగా ఉండుము" (2 తిమోతి 3:15). "మరియు సహోదరులారా, నేను ప్రకటించిన సువార్తను మీకు తెలియపరచుచున్నాను, మీరు దానిని అంగీకరించితిరి, దాని యందే నిలిచి యున్నారు..." (1 కొరింథీ 15: 1-2) అని పౌలు హెచ్చరించు చున్నాడు.

## 5. అందరు నేర్చుకొన వలసినవి.

"మీ దేవుడైన యెహోవాకు భయపడి యీ ధర్మశాస్త్రవాక్యములన్నిటిని అనుసరించి నడుచుకొనునట్లు పురుషులేమి స్త్రీలేమి పిల్లలేమి నీ పురములోనున్న పరదేశులేమి వాటిని విని నేర్చుకొనుటకై అవి పోగుచేయవలెను ! అలాగు నేర్చుకొనిన యెడల దాని నెరుగని వారి సంతతి వారు దానిని విని, మీరు స్వాధీన పరచుకొనుటకు యొర్దానును దాటబోవుచున్న దేశమున మీరు బ్రతుకు దినములన్నియు మీదేవుడైన యెహోవాకు భయపడుట నేర్చుకొందురు" (ద్వితియోప 31 :12-13).

## 6. మన పిల్లలకు దానిని బోధించవలెను.

"తండ్రులారా, మీ పిల్లలకు కోపము రేపక ప్రభువు యొక్క శిక్షలోను బోధలోను వారిని పెంచుడి" (ఎఫెసి 6:4). "నేడు నేను నీకాజ్ఞాపించు ఈ మాటలు నీ హృదయములో ఉండవలెను..నీవు నీకుమారులకు వాటిని అభ్యసింప జేసి, నీ యింట కూర్చుండు నప్పుడును త్రోవను నడుచు నప్పుడును

పండుకొనునప్పుడును లేచునప్పుడును వాటిని గూర్చి మాటలాడ వలెను ;" (ద్వితి యోప 6:6-7).

పైలేఖనముల ప్రకారము మనము దైవ వాక్యములను చదువుకొనవలయును నేర్చుకొనవలయును మరియు మన పిల్లలకు వాటిని నేర్పించవలయును. అందుకే జ్ఞాని యైన సొలొమోను ఈ విధంగా వ్రాసాడు "బాలుడు నడువ వలసిన త్రోవను వానికి నేర్పుము వాడు పెద్దవాడై నప్పుడు దాని నుండి తొలగిపోడు"(సామెతలు 22 :6). దేవుని వాక్యము చీకటిలో వెలుగిచ్చు దీపమును, జీవించుటకు ఆహారమును మరియు చలించుటకు సౌకర్యమునైయున్నది. అందుకే దావీదు మహారాజు ఈ లాగు వ్రాసాడు. "నీ వాక్యము నా పాదములకు దీపమును నా త్రోవకు వెలుగునై యున్నది. " (కీర్తనలు 119:105). అందుకే ఆ వాక్యము ప్రయాణికుని మార్గదర్శి, సైనికుని ఖడ్గము మరియు క్రైస్తవుని శాసనమై యున్నది.

ఇందులో పరదైసు పునరుద్ధరణ, పరలోకము తెరువబడుట నరకము తెలియజేయుట, ఈ గ్రంధము యొక్క ముఖ్య ఉద్దేశము.

అయితేఈ గ్రంధము చదువుచు, నేర్చుకొనుచు ఆచరించుట వలన ఎన్నోలాభాలు ఈలోకములోనే కాదు పరలోకము కూడ మనకు లభించును. ఈ వాక్యం రక్షణార్ధమైనది, చీకటిలో వెలిగిచ్చునది, మన ఆయుష్షునుపెంచేది మన నడవడిని కాపాడునది, జ్ఞానమును ప్రసాదించునది, వివేచన కలుగజేయునది. దీనిని దివారాత్రములు ధ్యానించుట వలన ధన్యత, నీటికాలువల యోరను నాటబడిన చెట్టువలె ఆకువాడక తన కాలమందు ఫలమిచ్చు చెట్టు వలె ఉండును. పిల్లలు చదువుట వలన సంతోషము కలుగును. యౌవనులు చదువుట వలన ప్రేరేణకలుగును. పెద్దలు చదువుట వలన మానసికమైన, ఆత్మీయమైన బలము కలుగును.దీనిని చదువుట మరియు లోబడుట వలన రక్షణ మరియు నిత్య జీవము కలుగును. "కాబట్టి మీరు చేయునదంతయు చక్కగా జరుగునట్లు ఈ నిబంధన వాక్యములను అనుసరించి నడుచుకొనవలెను." (ద్వితీయోప 29 :9).

- డి. జీవనందం.

జనవరి 26, 27, 28, తేదీలలో కాకినాడ సత్యవాణి భవన సముదాయములో ఒరియా బైబిలు సెమినార్ నిర్వహించబడెను. ఒరిస్సా రాష్ట్రములో అనేక జిల్లాలనుండి వచ్చిన 400 మంది ఒరియా భాషమాట్లాడువారు దీనికి హాజరైరి. వీరందరు సోదరి కబితా గూటం గారు నడుపుచున్న ఒరియా బైబిలు కరస్పాండెన్సు కోర్సు యొక్క పట్టభద్రులే. వీరిలో కొందరు డాక్టర్లు, లాయర్లు, విద్యాశాఖధికార్లు, బోధకులు, విద్యార్థులు. ఆ మూడు దినముల లోను వారు సత్యవాక్యమును విని, క్రీస్తునుగూర్చి ఆయన సంఘమును గూర్చి తెలిసికొని ఆత్మీయముగా ఆశీర్వదించబడిరి. ఒరియా సెమినార్‌లో రోయన్ ఫ్రెడరిక్, హర్షల్ బియర్డెన్, రాండాల్ఫ్ గాన్స్, రేండల్ హేగ్‌వుడ్, గ్లెన్‌బఫింగ్టన్ అను ఆమెరికా సోదరులు, జాషువాగూటం గారు వాక్యపరిచర్య చేయగా 8 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. అంతేకాకుండా మద్రాసులో నేషనల్ బైబిల్ కాలేజీలో విద్యనభ్యసించుచున్న ఆరుగురు ఒరియా విద్యార్థులు కూడ సెమినార్‌లో పాల్గొనిరి. బరంపురం, నవరంగపూర్, బోలాంగీర్ ప్రాంతములనుండి వచ్చిన క్రీస్తు సంఘసభ్యులు ఒరియా భాషలో చక్కని పాటలను పాడి దేవుని స్తుతించిరి. ఈ సెమినార్ అంతటిలోను సోదరులు బెంజమిన్ నందా, ఆంధ్రియాస్ మరియు పీటర్ సెఫనాస్ గార్లు తర్జుమా దార్లుగా యుండి సహాయం చేసిరి. సత్యవాణి, స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ బృందము వచ్చిన వారికి వసతి, భోజన పానదుల సౌకర్యములు కల్పించుటలో గొప్ప కృషిసల్పిరి.

సోదరి కబితా గూటంగారి కృషివలనను, జాషువా గూటంగారి కృషి వలనను ఒరిస్సా రాష్ట్రమంతయు క్రీస్తు యొక్క సత్య సువార్త గొప్పగా ప్రకటింప బడుటకు దేవుడు ద్వారము తెరచినందున ఒరిస్సా ప్రజలు, ఆంధ్రలోని క్రైస్తవులు, అమెరికా సోదర సోదరీలు దేవుని మహిమ పరచి స్తుతించిరి.

* * *

## క్రీస్తు సంఘములు సమర్పించు

## సత్యవాణి

రేడియో కార్యక్రమమును ప్రతి ఆది, మంగళ, గురు, శుక్ర, శని వారాల్లో రేడియో శ్రీలంక ద్వారా వినండి. ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సుకొరకు ఈ దిగువ చిరునామాకు వ్రాయండి, ఒక క్రొత్త నిబంధనను ఉచితంగా పొందండి.

**Director**

**Bible Correspondence Courses**

**P.O.Box. 80, Kakinada - 533 001 A.P.**

Regd. No. R/KD - 45/KD H.O.
Date of Posting : 15th of Every month

From
S A T Y A W A K K U
P.O. Box 80
KAKINADA - 533 001

No.

To
..............................
..............................
..............................
..............................